@netifocusnews @focustv

http://epaper.netifocusnews.com

www.netifocusnews.com

TS-18-0006625

FOCUS TELUGU TV

అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || మంగళవారం 20, ఆగస్ట్ 2024 || పేజీలు: 04

## రాష్ట్ర వ్యాప్తంగా రాఖీ సంబురాలు

- సీఎం రేవంత్‌కు రాఖీ కట్టిన సీతక్క
- కెటిఆర్‌కు రాఖీ కట్టిన బిఆర్ఎస్ మహిళా నేతలు
- చెల్లెలు కవితతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న కెటిఆర్
- మహిళలకు అండగా ఉంటానన్న ఎమ్మెల్యే హరీష్ రావు

2



## రక్షా బంధనాలు

- బాలికల గురుకులంలోకి అన్నదమ్ములను అనుమతించని ప్రిన్సిపాల్..
- కిటికీల్లోంచే రాఖీ కట్టిన అక్కాచెల్లెళ్లు
- తండ్రి భుజాలపైకి ఎక్కి కట్టించుకున్న తమ్ముడు
- మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో ఘటన
- పండగపూట పిల్లల ఆనందం ఆవిరి..

2



# టార్గెట్ ఒలింపిక్స్



## అన్ని క్రీడల శిక్షణ ఒకే గొడుగు కింద..

## ఫోర్త్ సిటీలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీ

- క్రీడా విభాగాలు, శిక్షణ సంస్థలు దీని పరిధిలోకే
- ప్రతి లోక్‌సభ నియోజక వర్గంలో క్రీడా పాఠశాల
- తెలంగాణ యంగ్ ఇండియా బ్రాండ్‌గా మారాలి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ సూచన

2



## తెలంగాణలోనే కొనసాగుతాం

- తేల్చిచెప్పిన సెమీకండక్టర్ల తయారీ సంస్థ కేన్స్
- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కేన్స్ సీఈవో రఘు

2



## రూ.31వేల కోట్లు

# రుణమాఫీ చేస్తాం

- స్పష్టంగా ఉన్న ఖాతాలకు మాఫీ పూర్తయింది
- పరిశీలన అనంతరం ఇతర అకౌంట్లకూ అమలు
- 2లక్షల పైన ఉంటే.. పైమొత్తం చెల్లిస్తే మాఫీ
- దురుద్దేశంతో విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలు
- రైతుల కోసం బీజేపీ చేసిందేంటి?: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:

రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.31వేల కోట్ల రుణమాఫీ చేస్తామని నీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇప్పటివరకు అన్ని వివరాలు సరిగా ఉన్న 22,37,848 ఖాతాలకు రూ.2లక్షల దాకా రుణమాఫీ మిగతా 2లో..



## మహిళలపై అఘాయిత్యాలు ఇప్పుడు గుర్తుకొచ్చాయా?

- ఘటనపై మహిళా కమిషన్ వెంటనే స్పందించదా..?
- మంత్రి సీతక్కకు కెటిఆర్ కౌంటర్..

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:

తెలంగాణలో కాంగ్రెస్.. బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తూనే ఉంది. మొన్నటి వరకూ రుణమాఫీ, ఇప్పుడేమో మహిళల అఘాయిత్యాలపై ఇలా రోజుకో వ్యవహారంపై నేతలు మాటల తూటాలు పేల్చుకుంటూనే ఉన్నారు. తాజాగా.. మంత్రి సీతక్కకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ మిగతా 2లో..



## రుణమాఫీ కాలేదంటే.. అరెస్ట్ చేస్తారా?

- కడుపు మండి ఆందోళన చేస్తే అరెస్ట్‌లా
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్‌రావు

2



## రూ.5వేల కోట్లతో 120గురుకుల భవనాలు

- స్థలాల ఎంపిక, డిజైన్లు పూర్తి చేయాలి
- అధికారులతో సమీక్షలో డిప్యూటీ సిఎం భట్టి

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:

తెలంగాణ వ్యాప్తంగా ఈ ఏడాది రూ.5వేల కోట్లతో 30 ప్రాంతాల్లో 120 గురుకుల పాఠశాల భవనాలు నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సమీకృత గురుకుల సముదాయాల కోసం నియోజక వర్గాల్లో స్థలాలు, డిజైన్ల ఎంపిక వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. గురుకులాల ఏర్పాటుకు గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 25 ఎకరాలు, పట్టణాల్లో 10 నుంచి 15 ఎకరాల భూమి సేకరించాలన్నారు. గురుకులాల్లో అవసరమైన సదుపాయాలపై ఈ నెల 29లోగా నివేదిక సమర్పించాలని విద్యాశాఖను ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు మిగతా 2లో..



## హైదరాబాద్‌లో 2 గంటలు కుండపోత

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:

హైదరాబాద్‌లో సోమవారం మధ్యాహ్నం 2గంటల పాటు కుండపోత వాన కురిసింది. వరద ఉధృతికి టోలిచౌకీ, సికింద్రాబాద్, షేక్‌పేట నాలా, యూసుఫగూడ శ్రీకృష్ణా నగర్, ఫిలిం నగర్ దీన్‌దయాళ్ నగర్ ప్రాంతాల్లో రోడ్లపై పార్క్ చేసిన వాహనాలు వరదనీటిలో కొట్టుకుపోయాయి. టోలిచౌకీ గెలాక్సీ వద్ద వరదనీరు ముంచేయడంతో కార్లు, ద్విచక్ర వాహనాలు నీటమునిగి.. కదల్లేక పోయాయి. కొన్ని కొట్టుకుపోయాయి. కార్లు సగం దాకా మునిగి మిగతా 2లో..

- మునిగిన కార్లు, బైక్‌లు..
- గంటలకొద్దీ ట్రాఫిక్ జాం..
- విమానాశ్రయం టెర్మినల్‌లోకి నీరు
- రాష్ట్రంలోని పలుచోట్ల భారీ వర్షం
- వేర్వేరు చోట్ల పిడుగుపడి ఇద్దరి మృతి
- మరో రెండు రోజుల పాటు వర్షాలే!



## రాజ్యసభ అభ్యర్థిగా సింఘ్వీ నామినేషన్

- కార్యక్రమంలో పాల్గొన్న సిఎం రేవంత్ మంత్రులు

వివరాలు 02లో..

# రూ.5వేల కోట్లతో 120గురుకుల భవనాలు

(మొదటి పేజీ తరువాయి..)

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ వినతిపై డిప్యూటీ సీఎం భట్టి సానుకూలంగా స్పందించారు. పెండింగులో స్కాలర్‌షిప్ బకాయిల జాబితా ఇవ్వాలని అధికారులకు తెలిపారు. నిర్ణీత గడువులోగా ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయించుకునే బాధ్యత అధికారులదేనని చెప్పారు.

# మహిళలపై అఘాయిత్యాలు ఇప్పుడు గుర్తుకొచ్చాయా?

(మొదటి పేజీ తరువాయి..)

స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. సీతక్కకు ఎనిమిది నెలల తర్వాత అయినా మహిళలపై అఘాయిత్యాలు గుర్తుకు రావడం మంచిదని సెటైరికల్‌గా మాట్లాడారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగితే ప్రభుత్వం, మహిళా కమిషన్ వెంటనే స్పందించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు దున్నపోతు మీద వాన పడినట్లుగా ఉందని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ' చెంచు మహిళపై అఘాయిత్యం జరిగితే మా నాయకులు వెళ్లే వరకూ పట్టించుకున్న వారు లేరు. షాద్ నగర్‌లో ఒక దళిత మహిళపై అఘాయిత్యం జరిగితే మా నాయకులు వెళ్ళే వరకు పట్టించుకోలేదు. మేము గొడవ చేస్తే పోలీసు అధికారిని సస్పెండ్ చేశారు. మహిళలు, పిల్లలు, ప్రజలు శాంతియుతంగా బ్రతికే విధంగా మహిళా కమిషన్, ప్రభుత్వం చూసుకోవాలి. హైదరాబాద్ నగరంలో మర్డర్లు జరుగుతుంటే ఆపే తెలివి లేదు. అఘాయిత్యాలు పెరుగుతుంటే పట్టించుకునే నాథుడు లేడు.రాష్ట్రానికి హోంమంత్రి దిక్కు లేదు. నేను పొరపాటున నోరుజారి ఒక మాట అంటే క్షమాపణ చెప్పాను. ప్రపంచంలో ఇంతకంటే పెద్ద సమస్య లేనట్లు దాన్నే సమస్య చేస్తున్నారు. దానికి రాజకీయ రంగు పులుముతున్నారు. మీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అఘాయిత్యాలపై విచారణ జరపండి. అప్పుడు శాంతి భద్రతలు ఎలా ఉండనో ఎప్పుడు ఎలా ఉన్నాయో కమిషన్ వేయండి. షీ టీమ్స్ పెట్టింది ఎవరు..?. భరోసా కేంద్రాలు పెట్టింది ఎవరు..?. ఉమెన్స్ సేఫ్టీ వింగ్ స్టార్ట్ చేసింది ఎవరు..? దిశలాంటి ఘటనలో తెలంగాణ లాంటి న్యాయం చేయాలని కోల్‌కతా ఘటనలో కోరుతున్నారు. దట్ ఈజ్ కేసిఆర్, మీకు మాట్లాడే అర్హత ఉందా?. హత్యలు జరుగుతుంటే పట్టించుకునే నాథుడు లేడు. మీరు మాట్లాడతారా' అని సీతక్కతో పాటు ప్రభుత్వంపై కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై నేరాలు పెరిగి పోయాయంటూ బీఆర్ఎస్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి నప్పటి నుంచి తొమ్మిదేండ్ల కాలంలో మొత్తం 1,57,610 కేసులు నమోదు అయ్యాయని లెక్కలు తీసి మరీ చెప్పారు. కేంద్ర హోంశాఖ పరిధిలోని నేషనల్ క్రైమ్ రికార్డుల బ్యూరో ఈ గణాంకాలను వెల్ల డించిందని, ఇవన్నీ మహిళలపై జరిగిన నేరాలను పోలీసులు కేసులుగా నమోదు చేసినవేనని అన్నారు. మహిళా కమిషన్‌ను తాము కూడా కలుస్తామని.. గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన నేరాలు వివరాలన్నిం టినీ సమర్పిస్తామని సీతక్క అన్నారు. ఈ వ్యాఖ్యలకు ఒకరోజు ఆలస్యంగా స్పందించిన కేటీఆర్ పైవిధంగా కౌంటర్ ఇచ్చారు.



# రాష్ట్ర వ్యాప్తంగా రాఖీ సంబురాలు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19: రాష్ట్ర వ్యాప్తంగా రాఖీ పండుగ సంబురాలు ఘనంగా కొనసాగాయి. జూబ్లీహిల్స్‌లో నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్కతో పాటు పలువురు రాఖీ కట్టారు. రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క రాఖీ కట్టారు. సీతక్కతో పాటు ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు పర్ణిక రెడ్డి, రాగమయి, కార్పొరేషన్ చైర్మన్లు బండ్రు శోభారాణి, నెరేళ్ల శారద, కాల్వ సుజాత, తదితరులు రేవంత్ రెడ్డికి రాఖీలు కట్టారు. తనకు రాఖీలు కట్టిన మహిళా నేతలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. సోదరీ సోదరుల మధ్య అనురాగాలకు, ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ అని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాఖీ పండగ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మాయిలను గౌరవించుకోవాల్సిన అవసరాన్ని రాఖీ పండుగ చాటి చెబుతుందన్నారు. మహిళా భద్రతకు పాటుపడదామని రాఖీ పండుగ సందర్భంగా అందరూ ప్రతినభూనాలన్నారు. మహిళలను గౌరవించుకోవడం మన సంస్కృతి అన్నారు. ప్రతి అడపడుచు, అన్నదమ్ములతో ఎంతో ఉత్సాహాన్ని, ఆనందా న్ని పంచుకునే పండగ రాఖీ పండగ అని అన్నారు. సోదరులు అందరూ బాగుండాలని ప్రతి ఆడబిడ్డ కోరుకుంటుందని తెలిపారు. సమాజంలో వస్తున్న రకరకాల మార్పులు వల్ల మహిళల పట్ల అనేక రకాల హింస జరుగుతుందన్నారు. ప్రతి సోదరుడు తన సోదరికి సమాజంలో ఎలా సెక్యూరిటీ, గౌరవం పొందాలి అనుకుంటారో.. అలాగే ప్రతి ఒక్కరూ తమ అక్క చెల్లమ్మల మాదిరి సమాజంలో ప్రతి ఆడబిడ్డను గౌరవించాలని అన్నారు. ప్రతి మహిళను మన ఇంటి బిడ్డగా చూస్తే అఘాయిత్యాలు, అత్యాచారాలు జరగవన్నారు. ఆడబిడ్డలకు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఇద్దాం.. ఎదగనిద్దాం అంటూ అందరికీ రాఖి పండగ శుభాకాంక్షలు తెలి పారు. సీఎంకు కూడా రాఖీ కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపానని.. చాలా సంతోషంగా ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఇకపోతే తెలంగాణ భవన్‌లో రాఖీ పండుగ సంబురాలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మహిళా నేతలు రాఖీ కట్టారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ విప్ గొంగిడి సునీత, ఇతర నేతలు కేటీఆర్‌కు రాఖీ కట్టి హారతిపట్టారు. మాజీ మంత్రి సత్యవతి.. అక్షింతలు వేసి కేటీఆర్‌ను ఆశీర్వదించారు. రాఖీ పండుగ సందర్భంగా దేశవ్యాప్తంగా ఘనంగా వేడుకలు జరుపుకుంటున్నారు. సాధారణ ప్రజలతోపాటు సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు కూడా రాఖీ వేడుకలు జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. జైల్లో ఉన్న తన సోదరి కల్వకుంట్ల కవిత ను ఉద్దేశించి తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఆవేదనతో కూడిన పోస్ట్ చేశారు.

# టార్గెట్ ఒలింపిక్స్..

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19: యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ముచ్చర్లలోని ఫోర్త్ సిటీలోనే ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కొత్త వర్సిటీ గురించి శనివారమే ప్రకటించిన ముఖ్యమంత్రి సోమవారం దీనిపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్సిటీ ఎలా ఉండాలన్న దానిపై పలు సూచనలు చేశారు. దేశ క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ ఉండాలని ఆకాంక్షించారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకూ ప్రాధాన్యం ఉండాలని, అన్ని రకాల క్రీడలను, క్రీడా శిక్షణ సంస్థలను ఒకే గొడుగు కిందకు తేవడమే స్పోర్ట్స్ యూనివర్సిటీ లక్ష్యమని చెప్పారు. తెలంగాణలోని భౌగోళిక పరిస్థితులు, మన శరీర నిర్మాణ తీరుకు అనువైన క్రీడలు ఏవో గుర్తించి, క్రీడలపై ఉత్సాహం ఉన్న వారిని గుర్తించి ఆయా క్రీడల్లో ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. దశాబ్దాల క్రితమే ఆఫ్రో-ఏషియన్ గేమ్స్‌కు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్‌ను భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు అనువైన వేదికగా మార్చాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడలో మన క్రీడాకారులకు పతకాలు దక్కేలా వారిని తీర్చి దిద్దాలన్నారు. విజేతల్లో మన స్పోర్ట్స్ యూనివర్సిటీ క్రీడాకారులు కచ్చితంగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇప్పించాలని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని క్రీడా విభాగాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలలు, అకాడమీలు, క్రీడా శిక్షణ సంస్థలు అన్నింటిని స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో మన దేశ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో రాణించే షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, ఆర్చరీ, జావెలిన్ త్రో, హాకీకి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ ఆరింటి తర్వాత శిక్షణ ద్వారా పతకాలు సాధించే అవకాశాలు ఉన్న క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని చెప్పారు. యూనివర్సిటీలో వసతులు, ఆహారం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అందించాలని స్పష్టం చేశారు. చిన్నతనంలోనే విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలు, వారికి ఏ క్రీడలపై మక్కువ ఉందో ఉపాధ్యాయులు గుర్తించాలన్నారు. వారందరికీ శిక్షణ ఇచ్చేలా ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఒక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆ పాఠశాలల్లో విద్యా బోధన కూడా ఉంటుందని, క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. హైదరాబాద్ స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశ క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా ఉండాలని, అందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ చెప్పారు. ఇటీవల ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన వివిధ దేశాల క్రీడాకారులను అధ్యయనం చేయాలన్నారు. పతకాల సాధనకు వారు శ్రమించిన తీరు, ఆయా దేశాలు వారిని ప్రోత్సహించిన తీరు, వారికి ఇచ్చిన శిక్షణ, ప్రోత్సాహం తదితరాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు యంగ్ ఇండియా పేరు పెడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ యంగ్ ఇండియాకు బ్రాండ్‌గా మారాలని ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యాల్లో తెలంగాణ శక్తిమంతమైన రాష్ట్రంగా గుర్తింపు పొందడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

దేశ క్రీడారంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. సందర్భంగా స్పోర్ట్స్ యూనివర్సిటీపై ఆయన వారితో చర్చించారు. ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏవిధంగా ఉండా లనే దానిపై పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకు ప్రాధాన్యం ఉండాలని, అన్ని రకాల క్రీడలను, క్రీడా శిక్షణ సంస్థలను ఒకే గొడుగు కిందకు తేవడమే స్పోర్ట్స్ యూనివర్సిటీ లక్ష్యమన్నారు. మన దేశంతో పాటు తెలంగాణలోని భౌగోళిక పరిస్థితులు, మన శారీర నిర్మాణ తీరుకు అనువైన క్రీడలు ఏవో గుర్తించి, క్రీడలపై ఉత్సాహం ఉన్న వారిని గుర్తించి వారిని ఆయా క్రీడల్లో ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దశాబ్దాల క్రితమే ఆఫ్రో-ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్‌ను భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు వేదికగా మార్చాలని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడలో మన క్రీడాకారులు పతకాలు దక్కేలా వారిని తీర్చి దిద్దాలని, అందులో మన స్పోర్ట్స్ యూనివర్సిటీ క్రీడాకారులు కచ్చితంగా ఉండాల్సిదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం వారికి నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇప్పించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని క్రీడా విభాగాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలలు, అకాడమీలు, క్రీడా శిక్షణ సంస్థలు అన్నింటిని స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో మన దేశ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో రాణించే షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, అర్చరీ, జావెలిన్ త్రో, హాకీకి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత శిక్షణ ద్వారా పతకాలు సాధించే అవకాశాలు ఉన్న క్రీడల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. యూనివర్సిటీలో ఆయా క్రీడల్లో శిక్షణకు అవసరమైన వసతులు, ఆహారంతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. చిన్నతనంలోనే విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలు, వారికి ఏ క్రీడలపై మక్కువ ఉందో ఉపాధ్యాయులు గుర్తించాలని ముఖ్యమంత్రి సూచించారు. అటువంటి విద్యార్థులందరికీ ఆయా క్రీడల్లో శిక్షణ ఇచ్చేలా ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఒక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ పాఠశాలల్లో విద్యా బోధనతో ఉంటుందని అయితే క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని, విద్యార్థులకు అక్కడ వారికి నచ్చిన క్రీడల్లో శిక్షణ ఇచ్చి, ప్రతిభ ఆధారంగా వారికి స్పోర్ట్స్ యూనివర్సిటీలో వసతి కల్పించి మరింత పదును తేలేలా శిక్షణ ఇప్పించాలన్నారు.. హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశ క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా ఉండాలని, అందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇటీవల ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన దేశాలు, క్రీడాకారుల వివరాలను సేకరించి, ఆయా క్రీడాకారులు పతకాల సాధనకు శ్రమించిన తీరు, ఆయా దేశాలు వారిని ప్రోత్సహించిన తీరు, వారికి ఇచ్చిన శిక్షణ, ప్రోత్సాహం తదితరాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇప్పటికే స్కిల్ యూనివర్సిటీకి యంగ్ ఇండియా పేరు పెట్టామని, స్పోర్ట్స్ యూనివర్సిటీ యంగ్ ఇండియా పేరు ఖరారు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు యంగ్ ఇండియా పేరు పెడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ యంగ్ ఇండియాకు బ్రాండ్‌గా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యాల్లో తెలంగాణ ఒక శక్తిమంతమైన రాష్ట్రంగా గుర్తింపు పొందడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

## తెలంగాణలోనే కొనసాగుతాం..

తెలంగాణలోనే కొనసాగుతామని సెమీకండక్టర్ల తయారీ సంస్థ కేన్స్ టెక్నాలజీ తేల్చి చెప్పింది. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని ఆ సంస్థ సీఈవో రఘు ఫణికర్ స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 23న కొంగరకలాన్‌లో అడ్వాన్స్ ఎలక్ట్రానిక్ యూనిట్ ప్రారంభోత్సవానికి రావాలని సీఎంను ఆహ్వానించారు. కాగా, సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఓశాట్ యూ నిట్ ఇండియన్ సెమీ కండక్టర్ మిషన్(ఐఎసఎం) పరిశీలనలో ఉందని, అనుమతి రాగానే ఓశాట్ యూనిట్ పనులను ప్రారంభిస్తామని రఘు ఫణికర్ తెలిపారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

## రాజ్యసభ అభ్యర్థిగా సింఘ్వీ నామినేషన్

కాంగ్రెస్ తరపున రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ పాల్గొన్నారు. రాజ్యసభలో తొమ్మిది రాష్ట్రాలకు చెందిన 12 స్థానాలకు సెప్టెంబరు 3న ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులు పీయూష్ గోయల్, సర్బానంద సోనోవాల్, జ్యోతిరాదిత్య సింధియా, కామఖ్య ప్రసాద్, వివేక్ ఠాకూర్, రాజేభోస్లే, బిప్లబ్ కుమార్ దేబ్(భాజపా), మీసా భారతి(ఆర్జేడీ), దీపేంద్రసింగ్ హుడా, కె.సి.వేణుగోపాల్(కాంగ్రెస్) లోక్‌సభకు ఎన్నికయ్యారు. వారంతా రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. ఒడిశాలో బీజేడీ ఎంపీ మమతా మొహంత తన పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణ నుంచి భారాస రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కె.కేశవరావు సైతం కాంగ్రెస్‌లో చేరి పదవికి రాజీనామా చేశారు. దాంతో ఈ 12 ఖాళీలకు ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉంది. ఈ మేరకు తెలంగాణ నుంచి తమ అభ్యర్థిగా అభిషేక్ సింఘ్వీని కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసింది. సుదీర్ఘకాలంగా ఆయన పార్టీకి సేవలందిస్తున్నారు. 2001 నుంచి కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారు. రెండు దఫాలు(2006, 2018)గా రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్ నుంచి పోటీచేసి భాజపా చేతిలో ఓడిపోయారు. తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యత్వం కోసం స్థానిక నాయకులు కొందరు ప్రయత్నించినా... జాతీయ రాజకీయాల్లో సింఘ్వీ సేవలు కాంగ్రెస్‌కు కీలకమైనందున ఆయన్నే అభ్యర్థిగా ఖరారు చేసినట్లు పార్టీ నేతలు వివరించారు. తెలంగాణలో కే కేశవరావు తమ పదవులకు, పార్టీలకు రాజీనామాలు చేశారు. దాంతో దేశవ్యాప్తంగా మొత్తం 12 రాజ్యసభ స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ ఖాళీ స్థానాలకు సెప్టెంబర్ 3న ఎన్నికలు జరగనున్నాయి. అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేసేందుకు ఈ నెల 21 వరకు గడువు ఇచ్చారు. ఈ క్రమంలో తెలంగాణ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అభిషేక్ మనుసింఘ్వీని రంగంలోకి దించారు. దాంతో ఇవాళ ఆయన నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ దాఖలుకు ముందు ఆయన అసెంబ్లీకి వెళ్లారు. అక్కడ తెలంగాణ మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సింఘ్వీకి స్వాగతం పలికారు. ఆయన మెడలో పూలమాల వేసి, కాంగ్రెస్ కండువా కప్పి సత్కరించారు.



# హైదరాబాద్‌లో 2 గంటలు కుండపోత..

(మొదటి పేజీ తరువాయి..)

అతికష్టమ్మీద లోపలున్న వారు బయట పడ్డారు. రోడ్లపై వరద నీరు చేరడంతో పలుచోట్ల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కుత్బుల్లాపూర్ వెంకన్నహిల్స్‌లో ఇళ్లలోకి వరదనీరు చేరింది. నాలాలు, మ్యాన్ హోళ్లు పొంగి.. మురుగునీరు రోడ్లపైకి రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. షేక్‌పేటలో 5.3 సెం.మీ, యూసుఫగూడలో 5.2, గచ్చిబౌలిలో 5.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. పలుప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. సోమవారం పలు జిల్లాల్లో వర్షం పడింది. నిజామాబాద్‌లో రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో వరద పోటెత్తింది. నగరంలోని రైల్వే కమాన్ అండర్‌బ్రిడ్జి వద్దకు భారీగా వరద పోటెత్తడంతో ఓ ఆర్టీసీ బస్సు నీళ్లలో చిక్కుకుపోయింది. లోపల 40మంది దాకా ఉన్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులొచ్చి.. స్థానికుల సాయంతో వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. జిల్లాలోని భీంగల్‌లో 10.3 సెం.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా పరిధిలోని మరో నాలుగు మండలాల్లో 5సెం.మీ పైచిలుకు వర్ష పాతం నమోదవ్వడం గమనార్హం. సిద్దిపేట జిల్లా ధూల్మిట్టలో 10.6 సెం.మీ, నల్లగొండ జిల్లా గుర్రంపోడులో 9.5 సెం.మీ, జగిత్యాల జిల్లా మేడిపల్లిలో 7 సెం.మీ, ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో 5.1 సెం.మీ, సిరిసిల్ల జిల్లా గంభీర్‌రావు పేటలో 6.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. పిడుగులు పడటంతో రాష్ట్రవ్యాప్తంగా ఇద్దరు మృతిచెందారు. పొలంలో పెసరకాయ ఏరుతుండగా పిడుగుపడటంతో వికారాబాద్ జిల్లా తాండూరు మండలం సంకిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన పదేళ్ల బాలుడు కార్తీక్ మృతిచెందాడు. పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి పిడుగుపడటంతో మంచిర్యాల జిల్లా భీమిని మండలం బిట్టూరుపల్లి గ్రామానికి చెందిన జక్కుల భాస్కర్ (56) మృతి చెందాడు.

**మరో రెండ్రోజులు వర్షాలే..:** రాష్ట్రవ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో గ్రేటర్ హైదరాబాద్ సహా కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం నిజామాబాద్, కరీంనగర్, హన్మకొండ, పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి, గద్వాల, నారాయణ్‌పేట జిల్లాలో, ఈనెల 21న కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి, జగిత్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, గద్వాల, నారాయణపేట, మహబూబ్‌నగర్, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులతో పాటు గంటలకు 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించింది. కృష్ణా పరిధిలో వరద తగ్గడంతో నాగార్జునసాగర్ గేట్లు మూసివేశారు. సాగర్‌కు 14 రోజుల్లో 200 టీఎంసీల వరద వచ్చింది. శ్రీశైలం ప్రాజెక్టుకు 96,811 క్యూసెక్కుల వరద వస్తోంది. 37,540 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 195.21 టీఎంసీల నీరు ఉంది. పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టమైన 45.77 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ నుంచి 16వేల క్యూసెక్కుల వరద వస్తుండగా అంతే నీటిని దిగువకు వదులుతున్నారు. గోదావరి పరిధిలోని మేడిగడ్డకు వరద ప్రవాహం కొనసాగుతోంది. 2.02 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా అంతేనీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద 3.1 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి.

# రక్షా 'బంధనాలు'

రామకృష్ణాపూర్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19: అక్కలతో రాఖీలు కట్టించుకోవాలని ఎంతో ఆశగా వచ్చిన చిన్నారికి గురుకుల పాఠశాల సిబ్బంది చుక్కలు చూపించారు. బాలికల గురుకులంలోకి వచ్చేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వబోమని, కుదరదంటే కుదరదని తెగేసి చెప్పారు. రాఖీలు కట్టించుకుని వచ్చేస్తామని ఆ పిల్లాడి తండ్రి మొత్తుకున్నా వాళ్లు వినిపించుకోలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో తండ్రి భుజాలపై ఎక్కి కూర్చొన చిన్నారికి.. కిటికీలో నుంచే ఆ ఇద్దరు అక్కలు రాఖీలు కట్టారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ గురకులంలో దాసరి సహస్ర, అన్విక చదువుకుంటుండగా.. వారి తమ్ముడు, తండ్రికి ఈ పరిస్థితి ఎదురైంది. రక్షాబంధన్ రోజు పాఠశాలకు వచ్చిన సోదరులను సిబ్బంది అనుమతించకపోవడంపై పలువురు తల్లిదండ్రులు మండిపడ్డారు.

# రుణమాఫీ కాలేదంటే.. అరెస్ట్ చేస్తారా?

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19: రుణమాఫీ కాలేదన్న రైతులను అరెస్టులు చేస్తారా అని ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాపాలన అని ప్రచారం చేసుకుంటూ అప్రజాస్వామిక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించడం సిగ్గుచేటని విమర్శించారు. రుణమాఫీ కాలేదని అదిలాబాద్ జిల్లా తలమడుగులో నిరసన తెలియచేస్తున్న రైతులను అరెస్టులు చేయడం హేయమైన చర్య అన్నారు. పోలీసు యాక్ట్ (30 ఎ&బి) పేరు చెప్పి, జిల్లాలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దని పోలీసులు హుకుం జారీ చేయడం హక్కులను కాలరాయడమేనని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలియ చేస్తున్న రైతులను ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారని, అరెస్టులు చేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతులు రుణమాఫీ కాకపోవడంతో కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయం, బ్యాంకుల చుట్టూ తిరిగి విసిగి వేసారి పోతున్నారని చెప్పారు. ఏం చేయాలో తెలియక చివరకు రోడెక్కి ఆందోళన చేస్తున్నారని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నదని వెల్లడిం చారు. ప్రభుత్వం రైతుల రుణమాఫీ సమస్యకు పరిష్కారం చూపకుండా, పోలీసులను పురమాయించి గొంతెత్తిన వారిని బెదిరించడం, అణగదొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గమని విమర్శించారు. ఒకవైపు రైతుబంధు రాక, మరోవైపు రుణమాఫీ కాక అన్నదాత ఆవేదనలో ఉన్నాడని చెప్పారు. వ్యవసాయ పనులు చేసుకోవాలా లేక రుణమాఫీ కోసం ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయాలా అంటూ కన్నీరు పెట్టుకుంటున్నారని వెల్లడించారు. ఏకకాలంలో ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆచరణలో మాత్రం అట్టర్ ఎ÷-లాప్ అయ్యారని ఎద్దేవాచేశారు. నమ్మి ఓటేసినందుకు రైతన్నను నట్టేట ముంచారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడ్డట్లు చరిత్రలో లేదన్న విషయాన్ని కాంగ్రెస్ పాలకులు మరిచిపోయినట్లున్నారని చెప్పారు. ఇప్పటికైనా కండ్లుతెరిచి రైతులందరికీ రుణమాఫీ చేయాలని, ఆందోళనలో ఉన్న రైతాంగానికి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేశారు. అదిలాబాద్ సహా ఇతర జిల్లాల్లో రైతన్నలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే అరెస్టు చేసిన రైతన్నలకు అండగా బీఆర్ఎస్ పార్టీ కార్యచరణ ప్రకటిస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# రూ.31వేల కోట్లు మాఫీ చేస్తాం..

(మొదటి పేజీ తరువాయి..)

చేశామని తెలిపారు. ఇంకా.. ఆధార్ వివరాలు సరిగా లేని 1.65 లక్షల ఖాతాలు, తప్పులు ఉన్న 1.50 లక్షల ఖాతాలు, రేషన్‌కార్డు లేని 4.83 లక్షల ఖాతాలు, రూ.2 లక్షల పైన రుణాలు కలిగిన 8 లక్షల ఖాతాలకే రుణ మాఫీ ఆగిందని పేర్కొన్నారు. ఈ ఖాతాలకు వెరిఫికేషన్ అనంతరం రుణమాఫీ చేస్తామని చెప్పారు. మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి రుణమాఫీపై ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. రూ.2 లక్షల పైన రుణం తీసుకున్నవారు.. ఆ పైన ఉన్న మొత్తాన్ని చెల్లించిన వెంటనేమాఫీ అమలవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. స్వతంత్ర భారత చరిత్రలో మరే ఇతర రాష్ట్రం ఇవ్వని విధంగా రుణమాఫీ చేశామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మొదటి పంటకాలంలోనే 22,37,848 మందికి రూ.17,933.19 కోట్లు మాఫీ చేశామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండగా.. 2018లో రుణమాఫీలో 2.26 లక్షల ఖాతాలకు చెందిన రూ.1419 కోట్ల సొమ్ము రిటర్న్ కాగా.. చర్యలేమీ తీసుకోలేదని గుర్తు చేశారు. 2024 రుణమాఫీలో 22 వేల ఖాతాలు రిటర్న్ కాగా.. 8 వేల ఖాతాలకు తిరిగి క్లియర్ చేశామని, పటిష్టమైన ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇక ఈ పంటకాలం నుంచే సన్న వడ్లకుకు రూ.500 బోనస్ అమలు చేస్తామని ఉత్తమ్ ప్రకటించారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు దురుద్దేశపూరితంగా విమర్శలు చేస్తున్నాయని అన్నారు. రైతుల మేలు కోసం బీజేపీ ఒక్క నిర్ణయం కూడా తీసుకున్న దాఖలాల్లేవని, రుణమాఫీపై ఒక్కసారి కూడా మాట్లాడలేదని ఉత్తమ్ ధ్వజమెత్తారు. 2 లక్షల దాకా రుణమాఫీ విషయంలో ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకం, రేషన్‌కార్డు లేకున్నా మాఫీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో రెండుసార్లు రుణమాఫీ ప్రకటించిందని, 2014లో నిర్ణయం తీసుకొని నాలుగేళ్లపాటు నాలుగు వాయిదాల్లో రుణమాఫీ నిధులు విడుదల చేశారని ఉత్తమ్ విమర్శించారు. 2014-15లో రూ.4040 కోట్లు, 2015-16లో రూ.4040 కోట్లు, 2016-17లో రూ.4025 కోట్లు, 2017-18లో రూ.4038 కోట్లు విడుదల చేయగా.. ఆ నిధులన్నీ వడ్డీకే సరిపోయాయని తెలిపారు. 2018లో రుణమాఫీ ప్రకటి ంచారని, కానీ.. 2018-19, 2019-20లలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని, 2020-21లో 2,96,571 మందికి రూ.408.3 కోట్లు, 2021-22లో 3,88,908 మందికి రూ.1339.5 కోట్లు, 2023-24లో 10,68,779 మందికి మొదటి దశలో 6763 కోట్లు, రెండో దశలో 6,07,641 మందికి 4818 కోట్లు మాఫీ చేశారని వివరించారు.

# కొన ఊపిరితో ఉండగానే అత్యాచారం

- తీవ్రంగా ప్రతిఘటించి చివరికి ప్రాణాలు విడిచింది..
- పోస్ట్ మార్టమ్ నివేదికలో పలు కీలక విషయాలు
- వైద్యురాలి హత్యాచార కేసు
- నిందితుడికి లై డిటెక్టర్ పరీక్షకు అనుమతి

**కోల్‌కతా, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:** జూనియర్ డాక్టర్ అభయపై కొనఊపిరితో ఉన్నప్పుడే లైంగికదాడి జరిగినట్టు పోస్టుమార్టం నివేదికలో వైద్యులు తేల్చారు. గొంతునులమడంతో ఎములకు విరిగిపోయాయని తెలిపారు. ఒంటిపై మొత్తం 14తీవ్రమైన గాయాలున్నట్లు వెల్లడించారు. గొంతు ఎముకలు విరిగిపోయాయని, అభయ శరీరంపై కొరికిన గాట్లు, గోళ్లతో గీచిన గాయాలు ఉన్నాయని నివేదికలో తెలిపారు. బలవంతంగా లైంగిక దాడి జరిగిన ఆనవాళ్లు ఉన్నాయని, దీని కారణంగా ఆమె వ్యక్తిగత అవయవాల వద్ద లోతైన గాయం జరిగినట్లు ఆ నివేదికలో ఉంది. ఊపిరి తిత్తుల్లో అధిక మొత్తం రక్తస్రావం జరిగినట్లు పోస్ట్ మార్టంలో గుర్తించారు.ఆ సమయంలో ఆమె నిందితుడితో శక్తిమేరకు పోరాడి ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు. నిందితుడు సంజయ్ రాయ్‌కి వైద్య పరీక్షలు నిర్వహించినప్పుడు అతడి శరీరంపై గోళ్లతో రక్కిన గుర్తులు కన్పించాయని సామాచారం.. బాధితురాలి మృతదేహాన్ని పరిశీలించగా.. ఆమె గోళ్లలోని చర్మం, రక్త నమూనాలు నిందితుడి నమూనాలతో సరిపోలినట్లు తెలుస్తోంది. మరోవైపు, వైద్యురాలి మృతదేహాన్ని తొలిసారి చూసిన ఓ సాక్షి మీడియాతో మాట్లాడారు. సెమినార్ హాల్‌లోని పోడియం దగ్గర ఆమె విగతజీవిగా కన్పించింది. ఒంటిపై కుర్తా చిందరవందరగా చిరిగిపోయింది. ట్రౌజర్స్ కన్పించలేదు. మెడ నుంచి మోకాలి వరకు నీలం రంగు బెడ్‌షీట్ కప్పి ఉంది. ఆమె ల్యాప్‌టాప్, నోట్‌బుక్, సెల్‌ఫోన్, వాటర్‌బాటిల్ పక్కనే ఉన్నాయని ఆ సాక్షి ఓ జాతీయ మీడియాకు వివరించారు. సెమినార్ హాల్‌లో విశ్రాంతి తీసుకునేందుకు వచ్చిన ఆమె ఒంటరిగా ఉందని గ్రహించి నిందితుడు ఈ దారుణానికి పాల్పడి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమబెంగాల్‌లో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయిన నిందితుడు సంజయ్ రాయ్‌కు పాలిగ్రాఫ్/లై డిటెక్టర్ పరీక్ష నిర్వహించేందుకు కలకత్తా హైకోర్టు అనుమతినిచ్చింది. ఈ మేరకు సీబీఐ వర్గాలు సోమవారం వెల్లడించాయి. మంగళవారం అతడికి ఈ పాలిగ్రాఫ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు సమాచారం. ఆగస్టు 9న వెలుగులోకి వచ్చిన ఈ దారుణం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆ జూనియర్ వైద్యురాలు ఆగస్టు 8వ తేదీ రాత్రి విధుల్లో ఉన్న సమయంలో ఈ అఘాయిత్యం జరిగింది. ఈ ఘటనలో సివిక్ వాలంటరీ సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవడంతో కేసును సీబీఐకి అప్పగిస్తూ ఆగస్టు 13న కలకత్తా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో ఆమెపై సామూహిక అత్యాచారం జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. లేదా నిందితుడి వెనుక ఎవరైనా ఉండి ఉంటారనే వార్తలు వినిపించాయి. ఈ క్రమంలోనే నిజానిజాలు తెలుసుకునేందుకు సంజయ్ రాయ్‌కు పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించేందుకు అనుమతినివ్వాలని న్యాయస్థానానికి సీబీఐ కోరింది. తాజాగా అందుకు అంగీకరించిన కోర్టు.. కేసు తదుపరి విచారణను ఆగస్టు 29వ తేదీకి వాయిదా వేసింది.

## క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి దయనీయం

**- క్యాబ్‌లో ప్రయాణించి సమస్యలు తెలుసుకున్న రాహుల్**

**న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:** క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారుతోంది. రైడ్ బుక్ అయితేనే పని. లేదంటే లేదు.. తొలుత ఉబెర్, ఓలా ఇతర కంపెనీలు డ్రైవర్లకు మంచి కమిషన్ ఇచ్చేవి. తర్వాత కమిషన్లు తగ్గించాయి. రైడ్స్ ఆశించిన స్థాయిలో రావడం లేదు. మెట్రో పాలిటన్ సిటీలో కుటుంబాన్ని పోషించేంత ఆదాయం డ్రైవర్లు పొందడం లేదు. ఇదే విషయాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గుర్తు చేశారు. సోమవారం రాహుల్ గాంధీ ఉబెర్ క్యాబ్ బుక్ చేసుకొని ఢిల్లీలో ప్రయాణించారు. ఉత్తరప్రదేశ్ ఎటాహ్‌కు చెందిన డ్రైవర్ సునీల్ ఉపాధ్యాయత్‌లో 11 నిమిషాల పాటు మాట్లాడారు. డ్రైవర్ తన సమస్యలను రాహుల్ గాంధీకి వివరించారు. ఆ వీడియోను రాహుల్ గాంధీ సోషల్ మీడియా ఎక్స్‌లో ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు స్పష్టమైన విధానాలను రూపొందిస్తామని రాహుల్ గాంధీ వివరించారు. ఆ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు ఇండియా కూటమి కృషి చేస్తోందని స్పష్టం చేశారు. 'తక్కువ ఆదాయం, ద్రవ్యోల్బణం వల్ల క్యాబ్ డ్రైవర్లు లాంటి చిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇది దేశంలోని కార్మికుల పరిస్థితికి అద్దం పడుతోంది. ఉబెర్ కారులో ప్రయాణించే సమయంలో డ్రైవర్ సునీల్ ఉపాధ్యాయ్‌తో ఇదే విషయం మాట్లాడా. తర్వాత అతని కుటుంబాన్ని కలిశాను. క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించా. డ్రైవర్లు అహో రాత్రులు కష్టపడతారు. డ్రైవర్లు ఎలాంటి పొందుపు చేయరు. కుటుంబ భవిష్యత్ కోసం ఏమి కూడబెట్టరు. క్యాబ్ డ్రైవర్ల సమస్యలపై కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన విధానాలు రూపొందించి న్యాయం చేస్తాయి అని' రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. 'డ్రైవర్లకు సామాజిక భద్రత ఉండటం లేదు. రైడ్స్ అంత ఈజీగా బుక్ కావడం లేదు. బుక్ అయిన తక్కువ కమిషన్ వస్తోంది. తక్కువ వేతనంతో జీవనం కొనసాగిస్తున్నాం. ఒకానొక సందర్భంలో సొంత ఊరికి వెళదామని అనుకున్నా. క్యాబ్ నడిపి ఢిల్లీలో జీవించడం కష్టమని తెలిసింది అని' క్యాబ్ డ్రైవర్ సునీల్ ఉపాధ్యాయ్ రాహుల్ గాంధీకి వివరించారు.రాహుల్ గాంధీ రైడ్ ముగిసిన తర్వాత డ్రైవర్ పిల్లలకు బహుమతి అందజేశారు. ఆ మరుసటి రోజు క్యాబ్ డ్రైవర్ కుటుంబంతో రాహుల్ గాంధీ భోజనం కూడా చేశారు. క్యాడ్ డ్రైవర్ల గురించి కాంగ్రెస్ పార్టీ ఆలోచన చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలు డ్రైవర్ల కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించాలని అనుకుంటున్నాయి. ఆ విధానం దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరతాం అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. డ్రైవర్ల జీవన ప్రమాణ స్థాయి పెంచేందుకు కృషి చేస్తామని రాహుల్ గాంధీ భరోసానిచ్చారు. ప్రతిపక్ష నేత హామీతో క్యాబ్ డ్రైవర్ల ఒకింత సంతోషంగా ఉన్నారు.

## ఒక్క ఫోటో ఎన్నో వార్తలకు సమాధానం

**- ఫోటోగ్రఫీ దినోత్సవ్లో మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:**

అంకిత భావంతో సృజనాత్మకంగా తీసిన ఒక ఫోటో కొన్ని పేజీల వార్తా సారాంశాన్ని అర్థవంతంగా తెలియజేసి, పాఠకులను ఆలోచింప చేస్తుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భం గా సోమవారం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఫోటోగ్రఫీ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు దినపత్రికలు చదవటం అలవాటని, అన్ని వార్తలు చదవక పోయినా అన్ని పేజీలలోని ఫోటోలను చూసి, ఆ వార్తలోని అంశాన్ని అర్థం చేసుకుంటానని తెలిపారు. తెలం గాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభయహస్తం హామీలపై నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలకు వచ్చిన ఫొటో ఎంట్రీలను ఇక్కడ ప్రదర్శించారు. ఉత్తమ ఫోటోగ్రాఫర్లను సన్మానించి అభినందించారు. ఫోటోగ్రాఫర్ల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుతో డ్రైవర్ మృతి

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:**

పెద్దపల్లి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పాము కాటుకు గురై ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన శాతరాజుల సతీష్ (39) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా, ఆదివారం రాత్రి కిరాణం షాప్‌కు వెళ్లి వస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సతీష్ మృతితో పాలకుర్తిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## తల్లి ఆత్మహత్యతో అనాథగా బాలిక

**- ఆసరాగా ఉంటామని ప్రకటించిన సిఎం రేవంత్**

**- లక్ష రూపాయాల తక్షణ సాయం అందించిన మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:**

ఆ చిన్నారి కష్టం పగవాడికి కూడా రాకూడదు. అప్పటి వరకు తల్లిచాటు బిడ్డగా ఎదిగిన ఆ చిన్నారికి ఒక్కసారిగా లోకం చీకటిగా మారిపోయింది. ఉన్న ఒక్క బంధం కూడా తెగిపోవడంతో ఒంటరిగా మిగిలిపోయింది. కన్న తల్లి చనిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న 11 ఏళ్ల బాలికకు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'నేనున్నానంటూ' బాసటగా నిలిచారు. బాలికకు అన్ని విధాలుగా అండగా నిలవాలని కలెక్టర్‌కు సీఎం ఆదేశాలు జారీ చేశారు. తల్లి ఆత్మహత్యతో ఒంటరిగా మిగిలిపోయిన బాలిక దుర్గకు అన్ని విధాలా అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లా తానూర్ మండలం బేల్‌తరోడా గ్రామానికి చెందిన ఒంటరి మహిళ మేర గంగామణి (36) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆమె ఏకైక కుమార్తె దుర్గ (11) అనాథగా మిగిలింది. తల్లి అంత్యక్రియలకు డబ్బులేకపోవడంతో దుర్గ భిక్షాటన చేసింది. విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. బాలికకు విద్యా,వైద్య, ఇతర అవసరాలకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ అభినవ్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం రేవంత్ ఆదేశాల మేరకు బాలికకు ఉచిత విద్య అందించేందుకు గురుకుల పాఠశాలలో చేర్చుతామని కలెక్టర్ వెల్లడించారు. వైద్యం, ఇతర సమస్యలేమైనా ఉంటే వాటిని వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. మరోవైపు విషయం తెలుసుకున్న మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. తానున్నానంటూ భరోసా కల్పించారు. ప్రతిక్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా లక్ష రూపాయలను తహసీల్దార్ లింగమూర్తి, ఎంపిడివో అబ్దుల్ సమాద్ ద్వారా బాలికకు అందించారు. ఆర్థిక చేయూతను అందించి చిన్నారికి విద్యపరంగా ఉచితంగా అన్ని సౌకర్యాలు కల్పించి పెళ్ళి అయ్యేవరకు బాధ్యత వహిస్తానని హామీ ఇచ్చారు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఖర్చులకు ప్రతి నెల డబ్బు పంపుతానని చెప్పారు. ఉండడానికి ఇల్లు కూడా సమకూరుస్తామని వెల్లడించారు. ఈ మేరకు పాపతో మంత్రి కోమటి రెడ్డి విడియో కాల్ చేసి మాట్లాడి ధైర్యం చెప్పారు. అధర్య పడవద్దు,తాను ఉన్నానని భరోసా కల్పించారు. త్వరలో పాపను కలుస్తానని చెప్పారు

## ప్రజల్లోకి కాంగ్రెస్ నేతలు

**- నేడు ఊరూరా రాజీవ్ జయంతి ఉత్సవాలు**

**నిజామాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:** స్థానిక ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు దృష్టి పెట్టారు. ఇప్పటినుంచే ప్రచార రంగంలోకి దూసుకుని పోయేందుకు ప్లాన్ రెడీ చేస్తున్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు పర్యటించేలా చేస్తున్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా సీనియర్ నేతలు కార్యకర్తలతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈనెల 20న రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా నియోజకవర్గాల్లో కార్యాక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. గ్రామంలో ప్రజలను కలిసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్థానికంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచార భేరిని మోగించేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తోంది. గ్రామగ్రామాన రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాలు జరపాలని సూచించారు. రాజీవ్ జయంతి సందర్భంగా మోగించనున్న ప్రచార భేరి కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. నిత్యం ఇక ప్రజల్లో ఉంటూ కాంగ్రెస్‌ను ప్రజలకు చేరువ చేస్తామని మాజీమంత్రి షబ్బీర్ అలీ అన్నారు. రోజు ఏదో ఒక కార్యక్రమం ఏర్పాటు చేసుకోవాలని, పార్టీ క్యాడర్ ఎంత మంది కలిసివస్తారో తెలిసిపోతుందని నాయకులు నిర్ణయించినట్లు తెలిసింది. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు సర్వశక్తులు ఒడ్డాలని సూచించారు. సాధారణ ఎన్నికలకు ముందు ప్రధాన పార్టీలు సందడి చేయాలని భావిస్తున్నాయి.

## మాజీ ఆర్మీ చీఫ్ సుందరరాజన్ కన్నుమూత

**చెన్నై, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:** ఇండియన్ ఆర్మీ మాజీ చీఫ్ సుందరరాజన్ పద్మనాభన్ ఇకలేరు. 83 ఏళ్ల పద్మనాభన్ వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతో సోమవారం ఉదయం తమిళనాడు రాజధాని చెన్నైలోని తన నివాసంలో కన్నుమూశారు. పద్మనాభన్ 2000 సంవత్సరం నుంచి 2002 వరకు రెండేళ్లపాటు ఇండియన్ ఆర్మీ చీఫ్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2002 డిసెంబర్ 31న సుందర రాజన్ ఆర్మీ చీఫ్‌గా పదవీ విరమణ చేశారు. ఆర్మీ చీఫ్‌గా నియమితులు కాకముందు ఆయన సౌతర్న్ కమాండ్‌లో జనరల్ కమాండింగ్ ఆఫీసర్‌గా పనిచేశారు. మొత్తానికి 1960 నుంచి 2002 వరకు ఆయన 43 ఏళ్లపాటు ఆర్మీకి సేవలు అందించారు. పద్మనాభన్ ఇండియన్ ఆర్మీ 19వ చీఫ్‌గా పనిచేశారు. ఆయన 1940 డిసెంబర్ 5న కేరళ రాజధాని తిరువనంతపురంలో జన్మించారు.

## కలుషితాహారం తిని నలుగురు విద్యార్థుల మృతి

**- వివిధ ఆస్పత్రుల్లో మరో 17మందికి చికిత్స - విచారణకు ఆదేశించిన సిఎం**

**అనకాపల్లి, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:**

కలుషితాహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో నలుగురు మృతిచెందారు. రెండు రోజుల క్రితం అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాస పట్టణంలోని అనాథాశ్రమంలో సమోసా తిని 27మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో సోమవారం నలుగురు మృతి చెందారు. మృతి చెందిన విద్యార్థులను జాషువా, భవాని, శ్రద్ధ, నిత్యగా గుర్తించారు. మిగతా 23 మందికి నర్సీపట్నం, అనకాపల్లి ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఏడుగురు, అనకాపల్లి ఏరియా ఆసుపత్రిలో 17 మంది విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. ఘటనపై డీఈవో అప్పారావు విచారణ చేపట్టారు. అనకాపల్లిలోని అనాథాశ్రమంలో చుట్టపక్కల ఉన్న చిన్నారు చదువు కుంటుంటారు. ఈ క్రమంలో ఆదివారం కలుషిత ఆహారం తిని నలుగురు మృత్యువాతపడగా.. దాదాపు 27 మంది అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం మధ్యాహ్నం ఆహారంతో పాటు సమోసాలను చిన్నారులు తిన్నారు. ఆ వెంటనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు వాంతులు చేసుకోవడంతో వెంటనే ఆశ్రమ నిర్వాహకుడు వాళ్లను ఇంటికి పంపించి వేశారు. ఇంటికి వెళ్లిన వెంటనే నలుగురు చిన్నారుల పరిస్థితి విషమంగా మారింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ వారు మృతిచెందారు. మిగిలిన విద్యార్థులు నర్సీపట్నం, అనకాపల్లి ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అస్వస్థతకు గురైన ఇతర విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఘటనకు గల కారణాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ఈ ఘటన తనను కలచి వేసిందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు జిల్లా కలెక్టర్లతో మాట్లాడినట్లు వెల్లడించారు. అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 17 మంది విద్యార్థులకు సరైన వైద్యం అందిచాలని అధికారులను ఆదేశించానన్నారు.కైలాసపట్నం ఫుడ్ పాయిజన్ కేసుపై హోం మంత్రి వంగలపూడి ఆనిత స్పందించారు. విద్యార్థుల మృతిపై తీవ్ర దిగ్భాం÷-రతి వ్యక్తం చేసిన ఆమె... అనకాపల్లి జిల్లా కలెక్టర్, కేజీహెచ్, నర్సీపట్నం ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లతో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అధికారులను అప్రమత్తం చేసిన హోం మంత్రి వంగలపూడి అనిత. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటీ డిఈఓ పెన్నాడ అప్పారావు, ఎంఈఓ పి రామారావుసహా పోలీసులు అధికారులు ఈ దుర్ఘటపై దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సులో మహిళ ప్రసవం

**- డెలివరీలో సహాయం చేసిన కండక్టర్**

**- అభినందించిన ఎండి సజ్జన్నార్**

**గద్వాల, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:**

తాను గర్భిణీ అని తెలిసినా... డెలివరీ టైం దగ్గర పడిందని తెలిసినా సోదరుడికి రాఖీ కట్టేందుకు ఓ సోదరి వెళ్తూ మార్గ మధ్యలోనే ప్రసవించారు. ఆర్టీసీ బస్‌లో ప్రసవ నొప్పులు రాగానే ఆమెను బస్సులో ప్రసవం చేశారు. సోదరుడికి రాఖీ కట్టేందుకు బయల్దేరిన నిండు చూలాలు.. బస్సులోనే ప్రసవించింది. సదరు బస్సులో లేడీ కండక్టర్‌తో పాటు ఓ నర్సు అందుబాటులో ఉండటంతో ఆమెకు దగ్గరుండి డెలివరీ చేయించారు. గద్వాల్ నుంచి వనపర్తి వెళ్లే ఆర్టీసీ బస్సులో ఈ ఘటన చోటు చేసుకుంది. గద్వాల డిపోనకు చెందిన గద్వాల-వనపర్తి రూట్ పల్లె వెలుగు బస్సులో సోమవారం ఉదయం సంధ్య అనే గర్భిణి తన సోదరులకు రాఖీ కట్టేందుకు వనపర్తికి వెళ్తున్నారు. బస్సు నాచహల్లి సమీపంలోకి రాగానే ఆమెకు పురిటినొప్పులు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన మహిళా కండక్టర్ భారతి బస్సును ఆపించారు. అదే బస్సులో ఉన్న ఒక నర్సు సాయంతో గర్భిణికి పురుడు పోశారు. సంధ్య పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. 108 అంబులెన్స్‌ను పిలిచి తల్లీబిడ్డను స్థానిక ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. రాఖీ పండుగ నాడు బస్సులో డెలివరీ చేసి ఒక మహిళా కండక్టర్‌ను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రశంసించారు. మానవత్వం చాటుకున్నారని కితాబు ఇచ్చారు. జరిగిన విషయాన్ని ఎక్స్ వేదికగా వివరించారు. 'రక్షాబంధన్ రోజున బస్సులో గర్భిణికి పురుడు పోసిన కండక్టర్ భారతికి ఆర్టీసీ యాజమాన్యం తరపున అభినందనలు తెలిపారు. తాను సమయస్ఫూర్తితో వ్యవహరించి నర్సు సాయంతో సకాలంలో పురుడుపోయడం వల్లే తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతూనే.. సామాజిక బాధ్యతగా సేవాస్ఫూర్తిని ఆర్టీసీ ఉద్యోగులు చాటుతుండటం గొప్ప విషయం.' అని సజ్జనార్ అన్నారు.

## ఆస్పత్రిలోనే రాఖీ కట్టి కన్నుమూసిన యువతి

**మహబూబాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:**

పండుగుపూట మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. హాస్పిటల్‌లో కొన ఊపిరితో ఉన్న ఓ యువతి తన సోదరులకు దవాఖానలోనే రాఖీ కట్టి కన్నుమూసింది. వివరాల్లోకి వెళ్తే.. నర్సింహులపేట మండలం కోదాడలో డిప్లొమా చదువుతు న్న ఓ యువతి(17) ప్రేమ పేరుతో ఓ ఆకతాయి వేధిస్తుండటంతో మనస్తాపం చెంది గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం హాస్పిటల్‌లో చేర్పించారు. కొన ఊపిరితో ఉన్న తాను రక్షాబంధన్ వరకు ఉంటానో లేదోనని భావించి శనివారం రాత్రి తమ్ముడు, అన్నలకు రాఖీ కట్టి గంటల వ్యవధిలో తుదిశ్వాస విడిచింది. కండ్ల ముందే తమ కూతరు ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కాగా, వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## మమత బెనర్జీపై అభ్యంతరకర పోస్ట్

**- డిగ్రీ విద్యార్థిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**కోల్‌కతా, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:**

దేశవ్యాప్తంగా కలకలం రేపిన వైద్యవిద్యార్థిని కేసును ప్రస్తావిస్తూ... మాజీ ప్రధాని ఇందిరా గాంధీని కాల్చి చంపినట్లే మమతా బెనర్జీపైనా కాల్పులు జరపాలని సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన ఓ డిగ్రీ విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు సదరు విద్యార్థిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితుడు బీకాం సెకండియర్ చదువుతున్న కీర్తిశర్మగా పోలీసులు పేర్కొన్నారు. విద్యార్థి బెదిరింపు పోస్టు.. రెచ్చగొట్టేదిగా, వర్గాల మధ్య విద్వేషాన్ని పెంచేదిలా ఉందని తెలిపారు. ఈ నెల 9న కోల్‌కతాలోని ఓ మెడికల్ కాలేజీలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధితురాలి పేరు, ఫొటోను బయటపెట్టాడని పోలీసులు తెలిపారు. సీఎంపై హత్యాయత్నానికి కుట్ర, అల్లర్లకు రెచ్చగొట్టడం, లైంగికదాడి బాధితురాలి వివరాలను బయటపెట్టడం తదితర నేరాలతో నిందితుడిపై కేసులు నమోదు చేశారు.

## ఆదిలాబాద్ జిల్లాలో జోరు వానలు

**- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు**

**ఆదిలాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కురుస్తున్న భారీ వర్షాలకు నదులు, వంకలు పొంగిపొర్లుతున్నా యి. చెరువులు నిండుతుండగా, ప్రాజెక్టుల్లోకి వరద పెరుగుతోం ది. కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇంటి నుంచి బయ టకు వెళ్లిన వ్యక్తి క్షేమంగా ఇంటికి వస్తాడన్న నమ్మకం కనిపిం చడం లేదు. చాలా చోట్ల రోడ్లపై నీరు ప్రవహిస్తోంది. ఆదిలాబా ద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం చిద్దారి ఖానాపూర్‌లో బారి వర్షానికి వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో సట్వాజిగూడ, మార్కాగూడ, బుర్సాన్ పటార్, నోవాగూడ, లోహర్, ఖండాల, గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలుచోట్ల నీటి మధ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ప్రవాహం ఏ వైపు నుంచి వస్తుందో తెలియదు. వాగు ఎక్కడ పొంగి ప్రవహిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఎటు చూసిన నీరే.. చిన్న కాలువ నుంచి పెద్ద వాగు వరకు.. అంతా నీరే. కాల్వలు, వాగులు పొంగిపొర్లుతుండటంతో రహదారులు స్థంబించిపోయాయి.

## కెటిఆర్‌తో శ్రీలంక మంత్రి భేటీ

**- బిఆర్ఎస్ హయాంలో అభివృద్ధిపై అభినందనలు**

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:**

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ని శ్రీలంక మంత్రి సదాశివం వియలేంద్రన్ ఆయన నివాసంలో కలిశారు. బిఆర్ఎస్ సర్కార్ హయాంలో రాష్ట్రాభివృద్ధిపై కెటిఆర్‌ను ఆయన అభినందించారు. బిఆర్ఎస్ పనితీరు తమకు స్ఫూర్తిగా నిలిచిందని సదాశివం అన్నారు. 'మీ పాలన మాకు ఆదర్శం. బిఆర్ఎస్ పదేళ్లలో అనూహ్య ప్రగతి సాధించింది. గతంలో శ్రీలంక పార్లమెంట్‌లోనూ ఈ విషయాన్ని నేను ప్రస్తావించా. హైదరాబాద్ అభివృద్ధి సింగపూర్‌ను తలపించేలా ఉంది. మాజీ సిఎం కేసీఆర్, కెటిఆర్ తెలంగాణను పెట్టుబడులకు కేరాఫ్‌గా మార్చా రు. ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పెరుగుతుంటే, రాష్ట్రాన్ని అవకాశాల అక్షయపాత్రగా మార్చిన మీ తీరు మాకు స్ఫూర్తిదాయకం' అని సదాశివం వెల్లడించారు. సదాశివంతో సమావేశం అనంతరం కెటిఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయన మాటలు బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం చేసిన పనులు గుర్తు చేశాయన్నారు. 'తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిపై ఆయన నాతో సుదీర్ఘంగా చర్చించారు. పదేళ్ల అత్యల్ప కాలంలో రాష్ట్రం ఇంతగా పురోగమించడంపై గర్వంగా ఉంది. హైదరాబాద్‌ను అవకాశాల హబ్‌గా మార్చడంలో మా కృషిని గుర్తించినందుకు మంత్రి సదాశివంకు కృతజ్ఞతలు. దశాబ్ద కాలంలో బిఆర్ఎస్ పాలన ఎంత అంకితభావంతో సాగిందో మంత్రి సదాశివం నాతో పంచుకున్నారు. బిఆర్ఎస్ సంపద సృష్టించడమే కాకుండా, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలను ఆదుకున్న విషయాన్ని నేను ఆయనకి వివరించా'అని కెటిఆర్ తన పోస్ట్‌లో వెల్లడి చేశారు.

## ఆలయాలకు శ్రావణశోభ

**- గోదావరి తీరాల్లో భక్తుల సందడి**


**కరీంనగర్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 19:**

శ్రావణ మాసం సోమవారం సందర్భంగా గోదావరి తీరంలో భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చేయించారు. వేములవాడ మొదలుకుని ధర్మపురి, కాళేశ్వరం, బాసర తదితర క్షేత్రాలకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. కాళేశ్వరంలో గోదావరి స్నానాలు చేసిన భక్తులు స్వామి దర్శనం చేసుకున్నారు. ధర్మపురిలో కూడా గోదావరి స్నానాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గోదావరి కళకళలాడుతండడంతో ప్రజలు భారీగా తరలి వచ్చారు. బాసరలో కూడా అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేములవాడలో భారీగా భక్తులు తరలివచ్చారు. గుండంలో స్నానాలు ఆచరించి కోడె మొక్కులు తీర్చుకున్నారు. ఇకపోతే కోటిలింగాల గోదావరి తీరం భక్తులతో నిండిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ వాహనాల్లో అధిక సంఖ్యలో తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు చేశారు. ఆలయంలోని శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు.మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని ఏడుపాయల దుర్గామాత ఆలయం భక్తులతో సందడి నెలకొన్నది.

# మిస్టర్ బచ్చన్ అందరు మెచ్చేలా ఉంది..

## సోషల్ మీడియా విమర్శలను పట్టించుకోను..

దర్శకుడు హరీశ్ శంకర్ 'మిస్టర్ బచ్చన్' సినిమాకు వచ్చిన టాక్‌పై స్పందించారు. సినిమాలో మంచిని పట్టించుకోకుండా, ఒక్క పాయింట్‌ను ఆధారంగా విమర్శించడం కరెక్ట్ కాదన్నారు. అలాంటి వారినీ, ఆ విమర్శలను పట్టించుకోవలసిన అవసరం లేదన్నారు. 'సోషల్ మీడియాలో ట్రోల్స్ నాకు కొత్తేమీ కాదు. అలానే సోషల్ మీడియా మాత్రమే నా జీవితం కాదు. నేను ఆకాశం లాంటి వాడిని. ఉరుము వచ్చినా.. పిడుగు వచ్చినా ఇలానే ఉంటా. నా వ్యక్తిత్వం అలాంటిది అన్నారు. 'గతంలో రవితేజ నటించిన కొన్ని సినిమాలకు వచ్చిన స్పందనలు నన్ను నిరాశపరిచాయి. కానీ, ఆ దర్శకుల మీద లేని అటాక్ నాపై జరిగింది. కొందరు ఉద్దేశపూర్వకంగానే నన్ను టా÷-గ్గ÷ట్ చేసి నెగెటివ్‌గా ప్రచారం చేస్తున్నారు. ఇందులోని ఒక డ్యాన్స్ మూమెంట్‌ను ప్రధానంగా తీసుకుని విమర్శిస్తున్నారు. కానీ, ఇందులో మంచి డైలాగులు చాలా ఉన్నాయి. వాటిని పట్టించుకోవడం లేదు. 'కట్నం తీసుకొని కాపురం చేసే మగవాడు వ్యభిచారం చేసినట్లు లెక్క' అని రాశాను. దాన్ని పక్కన పెట్టేశారు. ఆ డైలాగు అమ్మాయిలకు చాలా నచ్చిందని నాకు ఫోన్ చేసి చెప్పారు. అలాగే హీరో ఓ సందర్భంలో హీరోయిన్‌తో' నీకు నా ప్రేమ అర్థమయ్యేవరకు నిన్ను కదిలించను' అంటాడు. అమ్మాయిలు ఏ విషయంలోనైనా 'నో' చెబితే వాళ్ల నిర్ణయాన్ని గౌరవించాలనే ఉద్దేశంతో ఆ డైలాగు రాశాను. దీని గురించి కూడా ఎవరూ మాట్లాడలేదు. మంచిని పక్కనబెట్టి వాళ్లకు సౌలభ్యంగా ఉన్న వాటిని తీసుకుని విమర్శించే వాళ్లను పట్టించుకోవాల్సిన అవసరం లేదు' అని అన్నారు. వాటిలో ఉన్న కామన్ పాయింట్స్ నోట్ చేసుకున్నా. ఈ సినిమాపై అందరూ రాసిన రివ్యూలు చదివాను. సినిమా ఎలా ఉందనే దానిపై మొదటిరోజే నిర్ణయం తీసుకోవడం సరైన పద్ధతేనా? సినిమా ఎలా ఉందని టీజర్, ట్రైలర్, పాటల ఆధారంగా ప్రేక్షకులు ఓ నిర్ణయానికి వస్తారు. జిక్కీ పాటలో లిరిక్స్ ఎంతోమంది ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సినిమా కోసం టికెట్ కొని వచ్చిన ప్రతిఒక్కరి నిర్ణయాన్ని నేను గౌరవిస్తాను అన్నారు.










# దేవరతో తెలుగులోకి జాన్వీ కపూర్ ఎంట్రీ..

జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర' సినిమాతో బాలీవుడ్ ముద్దుగుమ్మ అతిలోక సుందరి శ్రీదేవి గారాల పట్టి జాన్వీ కపూర్ ఈ మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి, సౌత్ సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతోంది. 2018లో దడక్ అనే హిందీ చిత్రంతో సినిమాల్లోకి ఆరంగేట్రం చేసిన ఈ చిన్నది ఓ పది చిత్రాల వరకు నటించింది కానీ రావాల్సినంత గుర్తింపు దక్కించుకోలేక. ఒక్క హిట్ కొట్టలేక పోయింది. తన అందాలతో బాలీవుడ్‌లో నిత్యం వార్తల్లో నిలుస్తూ వచ్చిన ఈ సుందరి ఛాన్సులు దక్కించుకోవడంలో కాస్త వెనుకబడింది. అయితే తాజాగా ఈ అమ్మడు తెలుగు సినిమాల వైపు దృష్టి పెట్టడంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా చర్చల్లోకి వచ్చింది. ఈ క్రమంలో ఎన్టీఆర్‌తో నటిస్తున్న సినిమా కాకుండా రామ్‌చరణ్‌తో ఓ సినిమా చేస్తూ హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా దేవర సినిమా నుంచి ఎన్టీఆర్, జాన్వీలపై చిత్రీకరించిన చుట్టమల్లే పాటను రెండు వారాల క్రితం విడుదల చేయగా సోషల్ మీడియాలో సునామీ సృష్టిస్తోంది. అంతేకాదు యూ ట్యూబ్‌లో ఈ పాట ఇప్పటికే 7 కోట్లకు పైగా వ్యూస్ దక్కించుకుని సరికొత్త రికార్డులను తిరగరాస్తూ ఓ సరికొత్త చరిత్రను లిఖిస్తోంది.






# కన్నప్ప నుంచి మరికొన్ని పాత్రల విడుదల

మంచు విష్ణు 'కన్నప్ప' నుంచి మరో పాత్రను రివీల్ చేసిన మేకర్స్. బాలీవుడ్ నటుడు ముఖేష్ రిషి కంపడు అనే పాత్రలో నటిస్తున్నట్లు తెలిపింది. ఈ సినిమాకు సంబంధించి ఒక్కొక్క క్యారెక్టర్‌ను చిత్రయూనిట్ విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే తమిళ నటుడు శరత్ కుమార్ నాథనాధుడు అనే పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించిన కన్నప్ప టీం ఆ తర్వాత సినీయర్ నటి మధుబాల 'పన్నగ' అనే చెంచుల దొరసాని పాత్రలో కనిపించబోతుందని.. తెలుగు సినీయర్ నటుడు దేవరాజ్ 'ముండడు' అనే ఎరుకల దొర పాత్రలో నటుడు సంపత్ రామ్ భిల్లు జాతి దొర చండుడు అనే పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు తాజాగా మరో పాత్రను విడుదల చేసింది కన్నప్ప టీం. ఈ సినిమాలో సీనియర్ నటుడు ముఖేష్ రిషి కంపడు అనే పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించింది. పుళిందులు అత్యంత పురాతనమైన జాతి, సదాశివ కొండల్లో నివసిస్తుంటారు. వంశ పారంపర్యంగా ? పవిత్రమైన వాయు లింగాన్ని సంరక్షిస్తున్న ఈ పుళింద జాతిని భద్ర గణం అంటారు. భద్ర గణాన్ని నడిపించే నాయకుడే కంపడు అంటూ ముఖేష్ రిషి పోస్టర్‌ను విడుదల చేసింది. ఇతనితో పాటు టాలీవుడ్ నటుడు బ్రహ్మాజీ గవ్వరాజు అనే పాత్రలో నటిస్తున్నట్లు పోస్టర్‌ను విడుదల చేసింది. మంచు ఫ్యామిలీ నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100కోట్ల బ్జడెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు.

# పాత్రకు ఉన్న ప్రాధాన్యతను బట్టి నటిస్తా: కంగనా

## కొన్ని సినిమాల రిజెక్షన్‌పై కంగనా రనౌత్



అక్షయ్ కుమార్, రణ్‌బీర్ కపూర్ సినిమాలను తాను రిజెక్ట్ చేయడానికి గల కారణాన్ని చెప్పుకొచ్చారు బాలీవుడ్ నటి కంగనా రనౌత్. స్టార్ హీరో సినిమాలైనా తన పాత్ర నిడివి ఎక్కువ ఉంటేనే నటిస్తానని కంగనా రనౌత్ తేల్చి చెప్పారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'బాలీవుడ్‌లో టాప్‌లో ఉన్న హీరోల సినిమాల్లో నటించని కథానాయికలు ఎక్కువ రోజులు ఇండస్ట్రీలో కొనసాగలేరని అనుకుంటారు. కొందరు అలా క్రియేట్ చేసేశారు. కానీ, నేను చాలామంది స్టార్ హీరోల సినిమాలను రిజెక్ట్ చేశాను. బాలీవుడ్‌లో నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాను. అగ్రశ్రేణి నటిగా గుర్తింపు తెచ్చుకోవాలంటే స్టార్‌డమ్ ఉన్న హీరోలతో కలిసి నటించాల్సిన అవసరం లేదని నిరూపించాను. ఆ సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం కొన్ని సన్నివేశాలు, పాటలకే పరిమితం చేశారు. అలాంటి పాత్రలు అయితే కచ్చితంగా నేను చేయనని చెప్పేశా. బాలీవుడ్‌లో ఉన్న ఖాన్స్ అందరూ నాతో స్నేహంగా ఉంటారు. ఎప్పుడూ తప్పుగా ప్రవర్తించలేదు. అయినా పాత్రల నిడివి తక్కువ ఉందని వాళ్ల సినిమాలు తిరస్కరించా. నా తర్వాత ఈ రంగానికి రాబోయే మహిళలకు దిశానిర్దేశర చేయాలనుకుంటున్నా. ఇండస్ట్రీలో ఏ ఖాన్, కపూర్ కుటుంబాలు మనకు విజయం తెచ్చిపెట్టవు. హీరోపై హీరోయిన్ సక్సెస్ ఆధారపడి ఉంటుందనే అపోహను వదిలేయండి' అని అన్నారు. తాజాగా కంగానా నటించిన చిత్రం ఎమర్జెన్సీ పలుమార్లు వాయిదాల తర్వాత సెప్టెంబర్ 6న ఈ చిత్రం విడుదల కానుంది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితం ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఇందులో కథానాయికగానే కాకుండా దర్శకనిర్మాతగా కూడా కంగనా వ్యవహరించారు.

